సాక్షి
సంగారెడ్డి
శనివారం । 2 । డిసెంబర్ । 2023



హుస్నాబాద్‌లో ఓటింగ్ అధికం
హుస్నాబాద్ శాసనసభ ఎన్నికల్లో గతంలో కంటే ఈసారి అధిక శాతం మంది ఓటు వేశారు.
వివరాలు 8లో ▸



కొండపోచమ్మకు రా..రండి..
జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ ఆలయం 22వ వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబైంది.
వివరాలు 8లో ▸



ఆగని వలసలు
గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులు మారడం లేదు. స్థానికంగా ఉపాధి లేక దూర ప్రాంతాలకు వలస పోవాల్సిన దుస్థితి.
వివరాలు 9లో ▸

గెలుపోటములపై ప్రభావం

2018 ఎన్నికల కంటే 5 శాతం తగ్గిన పోలింగ్

- ఇది ఎవరికి నష్టం.. ఎవరికి లాభం?
- విశ్లేషిస్తున్న రాజకీయ వర్గాలు
- ఓట్ల లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఈ ఎన్నికల్లో తగ్గిన పోలింగ్ శాతం.. అభ్యర్థుల గెలుపు ఓటములపై ఎలాంటి ప్రభావం చూపుతుంది. ఇది ఏ అభ్యర్థికి నష్టం చేకూర్చుతుంది. ఎవరికి మేలు జరుగుతుంది. ఇలాంటి అంశాలపై జిల్లాలో రాజకీయ విశ్లేషణలు కొనసాగుతున్నాయి. 2018 ఎన్నికలతో పోలిస్తే ఈసారి జిల్లా వ్యాప్తంగా 5 శాతం పోలింగ్ తక్కువ నమోదైంది. ఐదు నియోజకవర్గాల్లో సైతం తగ్గింది. 2018 ఎన్నికల్లో జిల్లా సగటు పోలింగ్ 82.94 శాతం ఉండగా, ఈసారి జిల్లా సగటు పోలింగ్ శాతం 77.95 నమోదైంది. అంటే 4.99 (సుమారు ఐదు) శాతం తక్కువ పోలింగ్ జరిగింది. జిల్లాలో పలు చోట్ల అభ్యర్థులే తమకు అనుకూలమైన ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించి ఓట్లు వేయించారు. ఇతర ప్రాంతాలకు వలస పోయిన ఓటర్లను కూడా రప్పించి ఓట్లు వేయించారు. అయినప్పటికీ పోలింగ్ శాతం ఆశించిన మేరకు నమోదు కాకపోవడంతో ఎవరి మేలు జరుగుతుంది. ఎవరి నష్టం జరుగుతుందనే అంశంపై విశ్లేషణలు కొనసాగుతున్నాయి.

అభ్యర్థులూ.. లెక్కలేసుకుంటున్నారు.
పోలింగ్ ప్రక్రియ గురువారం ముగిసింది. అయితే ఇది ఎంత మేరకు జరిగిందనే గణాంకాలను ప్రకటించడంలో ఎన్నికల అధికారులు తర్జనభర్జన పడ్డారు. పోలైన ఓట్ల వివరాలను శుక్రవారం సాయంత్రం ప్రకటించారు. దీంతో అభ్యర్థులు ఎక్కడెక్కడ ఓటింగ్ పెరిగింది. తమకు అనుకూల గ్రామాల్లో ఎంతమేరకు పోలింగ్ జరిగింది. ఈ లెక్కన బూత్‌లవారీగా ఎక్కడ మనకు మెజారిటీ వచ్చే అవకాశాలున్నాయి. ఇలా అన్ని కోణాల్లో వారు లెక్కలేసుకున్నారు. ఏ బూత్‌లో ఎంత మెజారిటీ వస్తుంది. ఏ గ్రామంలో ఎంత లీడ్ ఉంటుందని గణాంకాలు వేసుకుంటున్నారు.

అన్ని పార్టీల అభ్యర్థులు ఈ ఎన్నికల్లో భారీగా ఖర్చు చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం పంపిణీ చేశారు. బహిరంగసభలకు, ర్యాలీలకు జనాలను తరలించేందుకు భారీగా డబ్బులు ఇచ్చారు. ఈ ఖర్చులను కూడా వారు లెక్కేసుకుంటున్నారు. సన్నిహితులతో చర్చించుకుంటున్నారు.

ఇటు ఓటర్లలో ఉత్కంఠ
జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారు. ఎవరు అపజయం పాలవుతారు. మూడు, ఆ తర్వాత స్థానాల్లో ఉన్న అభ్యర్థులు ఎవరి విజయ అవకాశాలను దెబ్బతీస్తారు. ఇలా అభ్యర్థులే కాదు ఓటర్లు కూడా విశ్లేషించుకుంటున్నారు. ఎన్నికల ఫలితాలు ఏ విధంగా ఉండబోతున్నాయనే అంశంపై అంచనాలు వేసుకుంటున్నారు. మొత్తంగా నువ్వా నేనా అన్నట్లుగా సాగిన ఈ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రెండు రోజులు సెలవులిచ్చినా..
ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు తీసుకున్న చర్యలు ఆశించిన మేరకు ఫలితాలనివ్వలేదు. రెండు రోజులైన నవంబర్ 29, 30వ తేదీలు వేతనంతో కూడిన సెలవును ప్రభుత్వం ప్రకటించింది. అయినప్పటికీ ఓటింగ్ శాతం తగ్గింది. ఇటు అధికార యంత్రాంగం కూడా ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహించింది. ప్రతిఒక్కరూ ఓటేయాలని ప్రచారం నిర్వహించింది. పలుచోట్ల ఫ్లెక్సీలను సైతం అధికారులు ఏర్పాటు చేశారు. కానీ గత ఎన్నికల మేరకు పోలింగ్ శాతం నమోదు కాలేదు. సాధారణంగానే పల్లెలతో పోలిస్తే పట్టణాల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతుంది. ఈ ఎన్నికల్లోనూ ఇదే తీరుగా పల్లెల్లోనే ఓటరు చైతన్యం కనిపించింది. పటాన్‌చెరు, అందోల్ నియోజకవర్గాల్లో నమోదైన పోలింగ్ శాతాలే ఇందుకు నిదర్శనం.

పోలింగ్ శాతమిలా..

నియోజకవర్గం	2018లో	2023లో
నారాయణఖేడ్	84.31	83.23
అందోల్	89.27	84.80
జహీరాబాద్	81.35	76.72
సంగారెడ్డి	83.83	75.42
పటాన్‌చెరు	75.97	69.61
జిల్లా సగటు	82.94	77.95

10.73 లక్షల మంది ఓట్లేశారు..
ఈ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల పరిధిలో 10.73 లక్షల మంది ఓట్లేసినట్లు తేలింది. జిల్లాలో మొత్తం 13.93 లక్షల మంది ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గాలవారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	మొత్తం ఓటర్లు	పోలైన పు.ఓట్లు	పోలైన స్త్రీల ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
నారాయణఖేడ్	1,16,581	1,14,607	2,31,188	98,805	93,613	1,92,418	83.23
అందోల్	1,22,699	1,26,549	2,49,248	1,05,642	1,05,642	2,11,364	84.80
జహీరాబాద్	1,36,523	1,34,262	2,70,785	1,01,302	1,01,303	2,07,748	76.72
సంగారెడ్డి	1,21,636	1,23,617	2,45,253	92,065	92,082	1,84,974	75.42
పటాన్‌చెరు	2,05,045	1,92,192	3,97,237	1,34,220	1,34,256	2,76,510	69.61
మొత్తం	7,02,484	6,91,227	13,9,3711	5,26,839	5,26,896	10,73,014	77.95

న్యూస్‌రీల్

విద్యుదాఘాతంతో ఒడిశా వాసి మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతంతో ఓ కూలీ మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు మండల పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ... అమీన్‌పూర్ పరిధిలో ఉన్న అవంతి ఫ్రైడ్ సంస్థలో ఒడిశాకు చెందిన సత్యబ్రాత్ చంద్ర(20) పనిచేస్తున్నాడు. ఆ సంస్థ చేపట్టే నిర్మాణాల్లో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. నవంబర్ 30న మిషన్‌తో తొమ్మిదో ఫ్లోర్‌లో ఇనుప రాడ్లు కట్ చేశాడు. ఆ తర్వాత విద్యుత్ బాక్స్ నుంచి మిషన్‌కు సంబంధించిన వైర్ తొలగిస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడ్డ అతడిని స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. అపార్ట్‌మెంట్ కాంట్రాక్టర్ సంజయ్, సైట్ మేనేజర్ సురేశ్ బాబు నిర్లక్ష్యం కారణంగానే విద్యుత్ షాక్ తగిలి కుమారుడు మృతిచెందాడని తండ్రి శీతాకాంత్ శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

173 కేసులు.. రూ.5.27 కోట్లు సీజ్

సంగారెడ్డి టౌన్ : ఎన్నికల తనిఖీల్లో భాగంగా జిల్లాలో 173 కేసుల్లో జప్తు చేసిన 5,27,42,852 రూపాయల్లో 162 కేసులకు సంబంధించి రూ.3,44,22,338లను విడుదల చేసినట్లు కలెక్టర్ శరత్ శుక్రవారం తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో జప్తు చేసిన 5,27,42,852 రూపాయల్లో సంబంధిత వ్యక్తులు సమర్పించిన ఆధారాలను పరిశీలించామన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా రూ.3,44,22,338లు విడుదల చేసినట్లు తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 45 కేసుల్లో జప్తు చేసిన రూ.86,53,810లు మొత్తం విడుదల చేసినట్లు చెప్పారు. అందోల్ నియోజకవర్గంలో 12 కేసుల్లో 19,80,020 రూపాయలు జప్తు చేయగా, 11 మందికి రూ.18,50,020లు విడుదల చేశామని వెల్లడించారు. జహీరాబాద్ నియోజకవర్గంలో 41 కేసుల్లో రూ.1,45,23,430లు జప్తు చేయగా 39 కేసులకు సంబంధించి రూ.97,97,430లు విడుదల చేసినట్లు వివరించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 29 కేసుల్లో జప్తు చేసిన రూ.56,15,988ల్లో 27 మందికి రూ.54,65,488లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 46 కేసుల్లో రూ.2,19,69,604 జప్తు చేయగా, 40 కేసులకు సంబంధించి రూ.86,55,590లు విడుదల చేసినట్లు తెలిపారు. 11 కేసులకు సంబంధించి సరైన ఆధారాలు సమర్పించనందున రూ.1,83,20,514ల నగదు విడుదల చేయలేదని స్పష్టం చేశారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్

సిద్దిపేట సీపీ శ్వేత



సిద్దిపేటకమాన్: ఓట్ల లెక్కింపు జరగనున్న ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీపీ శ్వేత శుక్రవారం తెలిపారు. పట్టణాలు, మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ప్రశాంతమైన వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కౌంటింగ్ సెంటర్ వద్ద పార్టీ జెండాలు, కండువాలు, ప్లకార్డులు ప్రదర్శించవద్దని సూచించారు. ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని తెలిపారు.

పాఠశాలలో అగ్ని ప్రమాదం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విద్యార్థులు, సిబ్బంది అందరూ సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం సిద్దిపేటలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కాకతీయ టెక్నో స్కూల్‌లో మధ్యాహ్నం గెస్ట్ రూంలో షార్ట్ సర్క్యూట్‌తో రిఫ్రిజిరేటర్ నుంచి మంటలు చెలరేగాయి. ఈ మంటలు గదిలోని రైస్‌కుక్కర్, ఏసీ, టీవీ, బీరువా, కుర్చీలకు వ్యాపించడంతో పొగతో కూడిన మంటలు వ్యాపించాయి అక్కడే ఉన్న పాఠశాల సిబ్బంది ముందుగా భోజనం చేస్తున్న విద్యార్థులను పాఠశాల నుంచి బయటకు తరలించారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక అధికారులు ఫైర్‌ఇంజన్‌తో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ షార్ట్ సర్క్యూట్‌తో విద్యార్థులకు, బోధన, బోధనేతర సిబ్బందికి ఎలాంటి అపాయం జరగలేదు. ఈ ప్రమాదం వల్ల రూ.50వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది.



పాఠశాల వద్ద మంటలను ఆర్పుతున్న ఫైర్ ఇంజన్

పింఛన్ మంజూరు అప్పుడే

- భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్


చందాదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేస్తున్న విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు: పదవీ విరమణ పొందిన నెలలోనే చందాదారులకు పింఛన్ మంజూరు చేస్తున్నామని భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. గత నవంబర్‌లో 17 మందికి పింఛన్ మంజూరు చేశామన్నారు. శుక్రవారం పటాన్‌చెరులోని పీఎఫ్ కార్యాలయంలో ఇందులో ఉన్న తొమ్మిది మందికి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యాజమాన్యాలు, చందాదారులు తమకు పింఛన్ దరఖాస్తు ఫారంతోపాటుగా ఇతర సంబంధిత పత్రాలు జత చేసి సకాలంలో అందజేయాలన్నారు. ఇప్పుడు రిటైర్ అయిన నెలలోనే పింఛన్ మంజూరు అందజేసేందుకు సిబ్బంది అంకిత భావంతో పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ ఆర్.శ్రీదేవి, అకౌంట్స్ అధికారి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.


ఎయిడ్స్ నివారణపై అవగాహన


విద్యార్థులతో జన్నీఫర్

జిన్నారం(పటాన్‌చెరు): ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా బొల్లారం మున్సిపల్ పరిధిలో గల డిజైర్ సొసైటీ ఫౌండర్ రవిబాబు ఆధ్వర్యంలో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన ఉత్సవాలకు కూడా ఇక్కడి విద్యార్థులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి యూఎస్ కాన్సులేట్ జనరల్ జన్నీఫర్ లార్సన్ హాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు ఆమె బహుమతులను అందజేశారు.

తలమునకలు

- ఓటరు నాడి పట్టుకునేందుకు నేతల యత్నాలు
- క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్న వైనం



రామచంద్రాపురం(పటాన్ చెరు): ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యింది. అభ్యర్థుల గెలుపు, ఓటమిపై క్షేత్రస్థాయిలో ఓటర్ల నాడిని పట్టుకునేందుకు రాజకీయ పార్టీల నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్నికల ఫలితాలు రాక ముందే వివిధ పార్టీల అభ్యర్థులు ఎవరికెన్ని ఓట్లు పడ్డాయన్న విషయంపై పార్టీ శ్రేణుల వద్ద ఆరా తీస్తున్నారు. రాజకీయ విశ్లేషకులతో సైతం చర్చిస్తూ అంచనా వేసుకుంటున్నారు. అయినా ఒక కొలిక్కి మాత్రం రాలేకపోతున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సైలెంట్ ఓటింగ్ పడిందన్న చర్చ జోరుగా సాగుతోంది. ఎవరికి వారే తమ పార్టీ అభ్యర్థి గెలుస్తున్నాడంటూ జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఆయా పార్టీ నాయకులు తాము ఆ ప్రాంతంలో పట్టు సాధించామని చెప్పలేని పరిస్థితి కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఓటర్లు ఫలితాలు రాక ముందే పరిస్థితి ఇలా ఉండొచ్చని చెప్పుకునేవారు. ఈసారి మాత్రం ఎవరు గెలుస్తారో? ఎవరు ఓటమి పాలవుతారో ఇప్పుడొక నిర్ధారణకు రాలేకపోతున్నారు. ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధుల అంచనా సైతం ఈసారి తారుమారు అయ్యే అవకాశం ఉంటుందని పలువురు చెబుతున్నారు.

నేతల్లో టెన్షన్!

- బొల్లారం మున్సిపల్ పరిధిలో 6.5 శాతం తగ్గిన పోలింగ్
- ఏ అభ్యర్థిపై ప్రభావం పడుతుందోనని పార్టీ శ్రేణుల్లో ఆందోళన

జిన్నారం(పటాన్‌చెరు): గతంతో పోలిస్తే ఈ ఏడాది పోలింగ్ శాతం తగ్గింది. ఈ ప్రభావం ఎవరిపై పడుతుందోనని నాయకుల్లో టెన్షన్ మొదలైంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు వారి సొంత ఊళ్లల్లో ఓటు వేసేందుకు తరలి వెళ్లటంతో పోలింగ్ శాతం తగ్గిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో 22 వార్డులు ఉన్నాయి. ఇక్కడ ఉన్న పలు పరిశ్రమల్లో ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రజలు కార్మికులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 60 వేల వరకు జనాభా ఉంది. 33,935 మంది ఓటర్లు ఉన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో బొల్లారం మున్సిపల్ పరిధిలో 19,852 ఓట్లు పోలయ్యాయి. 58.50 శాతంగా పోలింగ్ నమోదైంది. కాగా గత ఎమ్మెల్యే ఎన్నికల్లో 65 శాతం ఓట్లు నమోదయ్యాయి. అంటే 6.5 శాతం తక్కువ. మరో ఐదు వేల వరకు ఓట్లు పోలవ్వాల్సి ఉంది. బొల్లారం మున్సిపల్ పరిధిలో మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, మెదక్ తదితర జిల్లాలకు చెందిన ప్రజలు ఎక్కువ సంఖ్యలో నివాసం ఉంటున్నారు. కాగా వారి ప్రాంతాల్లో కూడా ఎన్నికలు ఉండటంతో అక్కడి నేతల ఒత్తిడితో ఓటు వేసేందుకు సొంత ఊళ్లకు ఎక్కువ సంఖ్యలో వెళ్లారు. దీంతో ఓటింగ్ శాతం తగ్గింది. ఈ తగ్గుదల ఏ అభ్యర్థిపై ప్రభావం చూపుతుందోనని నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల మధ్య మున్సిపల్ పరిధిలో ప్రధానంగా పోటీ ఎక్కువగా ఉంది. గెలుపోటములపై ఎవరి లెక్కలు వారికి ఉన్నాయి. ఈనెల 3న జరిగే ఓటింగ్‌లో ఏ అభ్యర్థి విజయాన్ని సాధిస్తారో చూడాలి.


బొల్లారం మున్సిపల్ వ్యూ


క్యూలో ప్రజలు (ఫైల్)


నాచగిరిలో వ్రతమాచరిస్తున్న భక్తులు

నాచగిరి వ్రతశోభితం

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరిలో శుక్రవారం కార్తీక సత్యనారాయణస్వామి వ్రతాల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు. వ్రత మొక్కులు తీర్చుకునేందుకు సత్యనారాయణ వ్రతమండపం చేరుకున్నారు. దంపతులు వ్రతపీటల ముందు కూర్చుని భక్తిశ్రద్ధలతో సత్యదేవుని వ్రతమాచరించారు. అనంతరం గర్భగుడిలో లక్ష్మీనృసింహుని దర్శించుకుని తరించారు. క్షేత్రంలో 40 పైగా వ్రతాలు జరగగా, ఆలయ వర్గాలు భక్తులకు ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. మహిళలు, భక్తులు భారీగా తరలివచ్చారు.

నూతన మద్యం పాలసీ షురూ..

సిద్దిపేటకమాన్: డిసెంబర్ 1నుంచి నూతన మద్యం పాలసీ ప్రారంభమైంది. సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, మిరుదొడ్డి సర్కిల్‌లో 93 మద్యం దుకాణాలకు ఆగస్టులో దరఖాస్తులు స్వీకరించి డ్రా పద్ధతి ద్వారా కేటాయించారు. లైసెన్స్ దారులు వైన్స్‌షాపులలో పూజలు చేశారు.

ట్రాక్టర్ కింద పడి యువ రైతు మృతి

రామాయంపేట(మెదక్): ట్రాక్టర్‌లో ధాన్యం తరలిస్తుండగా టైర్‌కింద పడి యువ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన యువరైతు నక్కని నవీన్ (25) తన ధాన్యాన్ని స్నేహితులతో కలిసి రోడ్డుపై ఆరబోశారు. అనంతరం ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌లో ఎక్కించి రైస్‌మిల్లుకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ పై ముందు కూర్చున్న నవీన్ ప్రమాదవశాత్తు టైర్‌కింద పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ అతడిని చికిత్స నిమిత్తం గ్రామంలోని పీహెచ్‌సీ నుంచి రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు.

మూడంచెల భద్రత

- స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేశ్

పటాన్‌చెరు టౌన్: ఈవీఎంలు, వీవీ ప్యాట్లు పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామని కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేశ్ అన్నారు. మూడంచెల భద్రతను ఏర్పాటు చేసి, పోలీసు అధికారులకు బందోబస్తు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగిస్తూ సిబ్బందికి సూచనలు చేశామని తెలిపారు. శుక్రవారం స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన కట్టుదిట్టమైన భద్రతను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పటాన్‌చెరు, సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్‌కు సంబంధించిన ఎన్నికల సామగ్రికి బలగాలు కంటికి రెప్పల పహారా కాస్తుంటాయని తెలిపారు. ఎలాంటి నిర్లక్ష్యానికి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలను తీసుకుంటున్నట్లు, సీసీ కెమెరాల పనితీరును కమాండ్ కంట్రోల్ నుంచి వీక్షించి రక్షణ అధికారులకు ఎల్లవేళలా సూచనలు చేస్తామని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం అనుమతి ఉన్న ప్రత్యేక అధికారులే సందర్శిస్తూ ఎప్పటికప్పుడూ రక్షణ చర్యలు చేపడుతున్నారన్నారు. సందర్శించే అధికారి పేరు, వెళ్లిన సమయం, తప్పనిసరిగా భద్రత అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక రిజిస్టార్లలో పొందుపరుస్తూ సంతకాలను సేకరిస్తారని పేర్కొన్నారు. ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ రాత్రి సమయంలో పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ, భద్రత చర్యలను సమీక్షిస్తూ ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారులు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న శరత్, రూపేశ్

పటాన్‌చెరుకు ఈవీఎంల తరలింపు

జహీరాబాద్: నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను పటాన్‌చెరులో ఉన్న గీతం వర్సిటీలోని కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. పట్టణంలోని స్ట్రాంగ్ రూం ఉండగా అధికారులు.. అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో సీల్ తీసి ఈవీఎంలను తరలించారు. శుక్రవారం కలెక్టర్ శరత్, ఎన్నికల పరిశీలకులు పవన్‌కుమార్, డీఎస్పీ రఘు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ఎయిడ్స్ నివారణపై అవగాహన

సంగారెడ్డి : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి శ్రీ హనుమంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ కార్యకలాపాల గురించి డీఎంహెచ్ఓ డాక్టర్ గాయత్రీ దేవి వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మతిస్థిమితం లేని వ్యక్తి మృతదేహం

మునిపల్లి(అందోల్): గుర్తు తెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ శుక్రవారం తెలిపారు. బుదేరా నుంచి కంకోల్ వెళ్లే 65వ నంబర్ జాతీయ రహదారిపై సంచరిస్తున్న మతిస్థిమితం లేని వ్యక్తిని నవంబర్ 26వ తేదీ రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తలకు, ముఖానికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఏఎస్ఐ బిక్షపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే బుదేరా పోలీస్‌స్టేషన్ 9908637363, ఎస్ఐ ఫోన్ నంబర్ 8712656749లో సంప్రదించాలని కోరారు.

'జీవీకే'కు కోవిడ్ వారియర్ అవార్డు

తాండూరు టౌన్: కోవిడ్ సమయంలో అత్యవసర సేవలు అందించిన జీవీకే ఎంటర్‌ప్రైజెస్ (ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్)కు కోవిడ్–19 వారియర్ అవార్డు దక్కింది. ఈమేరకు గురువారం జపాన్‌లో జరిగిన 6వ ఈఎంఎస్ ఆసియా టోక్యో కాన్ఫరెన్స్‌లో ఈఎంఎస్ రంగంలో సంస్థాగత వర్గం కింద ఈ అవార్డును జీవీకే ఎంటర్‌ప్రైజ్ అందుకుంది. జీవీకే సంస్థ.. అంబులెన్స్‌ల ద్వారా కోవిడ్ సమయంలో 25.3 లక్షల మందికి సేవలందించింది. దీంతో భారత ప్రభుత్వం అంబులెన్స్ ఈఎంటీ, పైలట్‌లను ఫ్రంట్‌లైన్ కార్మికులుగా గుర్తించింది. అత్యుత్తమ సేవలందించిన తమ సంస్థకు అవార్డు దక్కడం గర్వనీయమని 108, 102 జిల్లా కోఆర్డినేటర్ విజ్ఞేశ్వర్ తెలిపారు.

ఓటేసేందుకు వచ్చి.. ప్రమాదంలో వ్యక్తి మృతి

పరిగి: ఎదురుగా వస్తున్న స్కూటీని లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట్ గేట్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. దుద్యాల మండలం సాగరం తండాకు చెందిన దంపతులు మోహన్‌నాయక్(42), లక్ష్మీబాయి నగరంలో ఉంటున్నారు. గురువారం ఓటు వేసేందుకు గ్రామానికి వచ్చారు. ఓటు వేసి శుక్రవారం తమ కూతురు కీర్తిబాయితో కలసి స్కూటీపై నగరానికి బయలుదేరారు. మార్గమధ్యలో రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ స్కూటీని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మోహన్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మీబాయి, కీర్తిబాయికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నగరానికి తరలించారు. మృతుడి కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొడంగల్‌కు రాతి శిల్పాలు



కొడంగల్: పట్టణంలోని శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం కోసం తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి నుంచి రాతి శిల్పాలు శుక్రవారం వచ్చాయి. వాటికి మాలధారులు పూజలు చేసి క్రేన్ సాయంతో కిందకు దింపారు. అయ్యప్ప సేవా సమితి, ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్రాయాదవ్, ఉమాపతి గౌడ్, కానుకుర్తి నర్సిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కిషన్ ధాగ, జగదీశ్ కుమార్ తదితరులు ఆలయం వద్ద శిల్పాలను పరిశీలించారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

హుస్నాబాద్‌లో ఓటింగ్ అధికం



హుస్నాబాద్‌లోని పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టిన ఓటర్లు (ఫైల్)

- గతంలో కంటే ఈసారి పెరిగిన పోలింగ్ నమోదు
- నియోజకవర్గ వ్యాప్తంగా 84.66 శాతం నమోదు
- హుస్నాబాద్ అర్బన్ 80.31 శాతం

హుస్నాబాద్: హుస్నాబాద్ శాసనసభ ఎన్నికల్లో గతంలో కంటే ఈసారి అధిక శాతం మంది ఓటు వేశారు. గురువారం రాత్రి వరకు జరిగిన ఎన్నికల్లో 84.66 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గంలో 304 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. మొత్తం 2,42,177 ఓట్లకు గాను 2,05,017 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 1,01,937, స్త్రీలు 1,03,079 మంది, ఇతరులు ఒకరు ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో మహిళలు అధికంగా ఓటు వేశారు. దాదాపు నెల రోజుల నుంచి ఈవీఎం, వీవీ ప్యాట్‌పై అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం కల్పించడంతో ఓటింగ్ శాతం పెరిగింది. 2014, 2018 సార్వత్రిక ఎన్నికలతో పోల్చుకుంటే 2023లో ఓటింగ్ శాతం పెరిగింది. 2014లో 80.36 శాతం, 2018లో 83.61, 2023లో 84.66 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గం మొత్తం 2,42,177మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,19,757, స్త్రీలు 1,22,416, ఇతరులు నలుగురు ఉన్నారు.

నియోజకవర్గంలో పోలైన ఓట్ల వివరాలు

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	శాతం
హుస్నాబాద్	17221	15070	7547	7523	0	87.51
హుస్నాబాద్ అర్బన్	18118	14550	7232	7317	1	80.31
అక్కన్నపేట	32356	27746	13870	13876	0	85.75
కోహెడ	36229	31016	15394	15622	0	85.81
చిగురుమామిడి	33175	27820	13792	14028	0	83.86
సైదాపూర్	31877	27132	13524	13608	0	85.11
భీమదేవరపల్లి	37616	30919	15356	15563	0	82.20
వేలేరు	3859	3239	1605	1634	0	83.93
ఎల్కతుర్తి	31726	27526	13617	13908	0	84.66

దుబ్బాక నియోజకవర్గంలో..

నమోదైన పోలింగ్ శాతం 87.51

- మొత్తం ఓటర్లు 1,98,100
- ఓటు హక్కు వినియోగించుకున్నవారు 1,73,560
- అత్యధికంగా నార్సింగ్ మండలంలో 90.76 శాతం నమోదు

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గంలో గురువారం జరిగిన ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం నమోదు కావడం విశేషం. 2018 ఎన్నికల్లో నియోజకవర్గంలో అత్యధికంగా 86.23 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ సారి ఆ రికార్డును బ్రేక్ చేస్తూ 87.51 శాతం పోలింగ్ నమోదైంది. ఉమ్మడి జిల్లాలోనే దుబ్బాక నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ శాతం నమోదు అయింది. నియోజకవర్గంలో మొత్తం 1,98,100 మంది ఓటర్లు ఉన్నారు. గురువారం జరిగిన పోలింగ్‌లో 1,73,560 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో అత్యధికంగా నార్సింగ్ మండలంలో 90.76 శాతం పోలింగ్ నమోదైంది.

దుబ్బాక మండలంలో..

దుబ్బాక మున్సిపాలిటీతో పాటు మండలంలోని 53 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 47,835 ఓటర్లకుగాను 40,698 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 85,08 శాతం పోలింగ్ నమోదైంది.

అక్బర్‌పేట-భూంపల్లి..

భూంపల్లి–అక్బర్‌పేట మండలంలో 33 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 23,599 మంది ఓటర్లు ఉండగా.. 20,537 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 87.02 శాతం పోలింగ్ నమోదైంది.

మిరుదొడ్డి..

మిరుదొడ్డి మండలంలో మొత్తం 18,278 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 16,124 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 89 శాతం పోలింగ్ నమోదైంది.

దౌల్తాబాద్..

దౌల్తాబాద్ మండలంలో 23,850 ఓటర్లకు గాను 21,428 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 89.84 శాతం పోలింగ్ నమోదైంది.

రాయపోల్..

రాయపోల్ మండలంలో మొత్తం 21,125 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో 19,426 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 89.92 శాతం పోలింగ్ నమోదైంది.

తొగుట..

తొగుట మండలంలో మొత్తం 20,265 మంది ఓటర్లకుగాను.. 18,031 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 89 శాతం పోలింగ్ నమోదైంది.

చేగుంట..

చేగుంట మండలంలో మొత్తం 30,929 మంది ఓటర్లుండగా.. 26,492 ఓటు హక్కును వినియోగించుకున్నారు. 85.65 శాతం పోలింగ్ నమోదైంది.

నార్సింగ్...

నార్సింగ్ మండల పరిధిలో మొత్తం 8648 మంది ఓటర్లు ఉండగా... 7847 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 90.76 శాతం పోలింగ్ నమోదైంది.

రేవంత్‌రెడ్డిని కలిసిన టీఆర్ఆర్



రేవంత్‌రెడ్డితో టీఆర్ఆర్



రేవంత్‌రెడ్డితో ప్రసాద్‌కుమార్ తదితరులు

పరిగి: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల తీరుపై రేవంత్ రెడ్డి ఆరా తీసినట్లు తెలిసింది. ఓటింగ్ సరళి ఎలా ఉంది.. ఎలాంటి ఫలితాలు వస్తాయనే విషయాలు చర్చించినట్లు చెప్పారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అందుకు ముందుగానే శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రసాద్‌కుమార్

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ అభ్యర్థి, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల తీరుపై చర్చించినట్లు తెలిసింది.

కాల్చొద్దు.. కలియ దున్నాలి

- వరి కొయ్యలకు నిప్పు పెడితే నష్టమే..
- మిత్రపురుగులు, సూక్ష్మజీవులు చనిపోయే ప్రమాదం



రవికుమార్, తునికి కేవీకే సీనియర్ శాస్త్రవేత్త

కౌడిపల్లి(నర్సాపూర్): వరి కోతలు పూర్తికాగానే రైతులు యాసంగి పనులు మొదలు పెట్టారు. వానాకాలం సీజన్‌లో కూలీల కొరత కారణంగా హార్వెస్టర్లతో వరి కోతలు కోయడంతో పొలంలో కొయ్యలు మిగిలాయి. పశుసంపద ఉన్న రైతులు గడ్డి సేకరిస్తుండగా.. మిగతా రైతులు వాటిని కాల్చివేస్తున్నారు. ఇలా చేయడం వల్ల నష్టాలే ఎక్కువ. పొలంలో మిగిలిన కొయ్యలను, గడ్డిని కలియ దున్నడం వల్ల భూసారం పెరుగుతుందని కౌడిపల్లి మండలం తునికి వద్ద గల డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సీనియర్ శాస్త్రవేత్త రవికుమార్ తెలిపారు. ఆయన రైతుల కోసం మరికొన్ని సూచనలు చేశారు.





వరి కొయ్యలను కాల్చిన రైతులు

నష్టాలు..

- వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయి.
- నేలకు మేలు చేసే క్రిమి కీటకాలు నశించడమే కాక భూసారం తగ్గిపోతుంది.
- నేలలో గడ్డిని కలియ దున్నడం వల్ల సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.
- భూసారంతోపాటు దిగుబడులు పెరిగి రైతుకు మేలు జరుగుతుంది.
- వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుంది.
- విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది.
- ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది.
- భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి.
- పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి.
- పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉన్నది.
- దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కూడా ఒక్కోసారి బొగ్గవుతాయి.

ప్రయోజనాలు..

- వరి కొయ్యలు నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశముంది.
- దుక్కి దున్నే సమయంలో సూపర్ పాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి.
- ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది.
- దున్నడం వల్ల ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవుతుంది.
- మొక్కలకు 2 శాతం నత్రజని(యూరియా), 4 శాతం పాస్పరస్ అదనంగా అందిస్తుంది.
- జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మధాతువులు పంటకు మేలు చేకూర్చుతాయి.
- నేలలో కరగని మూలకాలను అనుకూలంగా మార్చుతుంది. నీటినిల్వ పెరుగుతుంది.
- కొయ్యకాళ్లను భూమిలో కలియ దున్నితే, గడ్డి ద్వారా పోషకాలన్నీ తిరిగి నేలకు చేరుతాయి.

కొండపోచమ్మకు రారండి..



కొండపోచమ్మ దేవాలయం

- ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- నేటి నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు
- 4న శివపార్వతుల కల్యాణం



అమ్మవారి మూలవిరాట్

జగదేవ్‌పూర్(గజ్వేల్): పక్షుల కిలకిల రాగాలు.. ఎత్తయిన నల్లని నాపరాతి గుట్టల మధ్య జగన్మాత శీలాదేవి కొలువైన కొండపోచమ్మ దేవస్థానం తెలంగాణలోనే అత్యంత ప్రసిద్ధి గాంచింది. జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ ఆలయం 22వ వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబైంది. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా విరాజిల్లుతున్న అమ్మవారు కొమురవెల్లి మల్లికార్జునస్వామికి స్వయాన చెల్లెలుగా చెబుతుంటారు. ప్రతియేటా కార్తీకమాసంలో కొండపోచమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలు ఈనెల 2వ తేదీ(శనివారం) నుంచి 4వ తేదీ(సోమవారం) వరకు నిర్వహించేందుకు ఆలయ పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. ఈ వేడుకల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు హైదరాబాద్, సికింద్రాబాద్, ఉమ్మడి మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.

రోజువారీ పూజా కార్యక్రమాలు

ఆలయంలో మూడు రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. వార్షికోత్సవాల సందర్భంగా మొదటి రోజు శనివారం గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపస్థాపన, అగ్ని ప్రతిష్ఠాపన, మూలమంత్ర హవనం, అభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. రెండో రోజు ఆదివారం ప్రాతఃకాల పూజ, మూలమంత్ర హోమం, స్థాపితా దేవతాపూజ, సామూహిక కుంకుమార్చన, మంగళహారతి, చివరి రోజు సోమవారం శివపార్వతుల కల్యాణం జరగనుంది.

ఏర్పాట్లు పూర్తి

కొండపోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయానికి రంగులు వేయించడంతో పాటు విద్యుత్ దీపాలంకరణ చేశాం. తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– ఈఓ మోహన్‌రెడ్డి

కాంగ్రెస్ విజయం ఖాయం



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

- హుస్నాబాద్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్
- స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రం పరిశీలన

సిద్దిపేటఅర్బన్: తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాలు పూర్తిస్థాయిలో అందకపోవడంతో ప్రజలు మార్పు కోరుకున్నారని, వారు కోరుకున్నట్లే కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుందని హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పొన్నాలలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం బందీ అయిందని, పరిపాలన వికేంద్రీకరణ జరగాల్సింది పోయి, ప్రగతి భవన్ కేంద్రంగా పాలన సాగించి ప్రజల ఆకాంక్షలను బొందపెట్టారని అన్నారు. మార్పు జరగాలి.. కాంగ్రెస్ రావాలనే ప్రజల నినాదాన్ని నాయకులు అందిపుచ్చుకుని విజయానికి బాటలు వేశారని అన్నారు. సీపీఐ మద్దతునిచ్చి ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి, కాంగ్రెస్ గెలవడానికి విశేష కృషి చేసిందని అన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకులంతా ఇది ప్రజల గెలుపుగా అభివర్ణించారని గుర్తు చేశారు. డిసెంబర్ 9న సోనియాగాంధీ పుట్టినరోజున కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారంటీ అయిన హుస్నాబాద్ మెడికల్ కళాశాలకు అంకురార్పణ జరుగుతుందని తెలిపారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఉచిత కరెంటు, గ్యాస్ ధరలో రాయితీ వంటివి అమలు చేస్తామని గుర్తుచేశారు. బీజేపీ నాయకులు చెప్పిన విధంగా డబుల్ ఇంజిన్ అంటే రాష్ట్రంలో రెండు సీట్లకే పరిమితం కాబోతుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కాంగ్రెస్ నాయకులు గంప మహేందర్, అత్తు ఇమామ్, తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామచంద్రపురం పట్టణంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఎం.శివకుమార్ (28) ఉద్యోగం లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం సాయంత్రం రాయసముద్రం చెరువులో శివకుమార్ శవమై కనిపించాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో..

జిన్నారం(పటాన్‌చెరు): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిషా రాష్ట్రం, బాలంగిర్ జిల్లా దుంగిరిపల్లి గ్రామానికి చెందిన పురందర దారువా(41) కుటుంబ సభ్యులతో కలిసి రెండేళ్లుగా అన్నారం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఓ పరిశ్రమలో కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. మూడు నెలల నుంచి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన దారువా అతిగా మద్యం సేవించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

ఉరేసుకుని వివాహిత

దుబ్బాకరూరల్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రామక్కపేట గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు...గ్రామానికి చెందిన చింతల స్వప్న(25) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలుకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్ఐ గంగరాజును వివరణ కోరగా.. ఆత్మహత్య చేసుకున్న విషయం వాస్తవమేనని, కుటుంబ సభ్యులు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతానికి మృతదేహం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి రతలించారు. మృతికి గల కారణాలు తెలియ రాలేదు.



దారువా మృతదేహం